ఆరోగ్య ప్రదాయిని అల్లనేరేడు

- పండ్లతో బోలెడు ప్రయోజనాలు
- కిలో రూ.70 నుంచి రూ.100ల వరకు విక్రయం
- నారాయణఖేడ్‌లో రూ.200 పలుకుతున్న పండ్లు

7లో



పత్తి.. విత్తు

తొలకరి వర్షాలతో రైతన్నలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. దుక్కులు దున్ని సిద్ధం చేస్తున్నారు. మద్దూరు మండలంలోని ధర్మారం గ్రామంలో శుక్రవారం రైతులు కూలీలతో పత్తి విత్తనాలను విత్తుతున్నారు.

- మద్దూరు, జూన్ 7





రూట్, డిపార్ట్‌మెంట్, ఐడెంటిఫికేషన్ అధికారులకు శిక్షణ ఇస్తున్న కలెక్టర్ మనుచౌదరి

గ్రూప్-1కు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లాలో 21 పరీక్షా కేంద్రాలు
- 8,223 మంది అభ్యర్థులు
- సెంటర్ల వద్ద 144 సెక్షన్

సిద్దిపేట క్రైం, జూన్ 7 : గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం జిల్లాలో 21 పరీక్షా కేంద్రాల్లో 8,223 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ఉదయం 10.30కు పరీక్ష ప్రారంభం కానుండగా మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగనున్నది. నిమిషం నిబంధన అమలు చేయనున్నారు. పరీక్ష సమయానికి నిమిషం ఆలస్యమైన అనుమితంచబోమని అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రంలోకి బ్యాగులు, సెల్‌ఫోన్లు, స్మార్ట్‌ఫోన్లు, వాచ్‌లు, క్యాలిక్యులేటర్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను నిషేధించారు. అభ్యర్థులు తమ వెంట పరీక్ష హాల్‌టికెట్, మాత్రమే తీసుకురావాలి. ప్రాథమిక పరీక్షకు బయోమెట్రిక్ హాజరును నమోదు చేస్తారు. మెహిందీ, టాటూలు వేసుకోవద్దని సూచిస్తున్నారు.

పరీక్షా కేంద్రాల వివరాలు

సిద్దిపేట పట్టణంలో 21 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పొన్నాల గ్రామ శివారు ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలలోని ఏ, సీ, డీ, ఈ బ్లాక్‌లలో నాలుగు కేంద్రాలను, మెదక్ రోడ్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడు సెంటర్లను ఏర్పాటు చేశారు. మిగతావి పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉన్నాయి.

298 మందితో బందోబస్తు

ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద పోలీసులతో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇద్దరు అడిషనల్ డీసీపీలు, నలుగురు ఏసీపీలు, 14 మంది సీఐలు, 21 మంది ఎస్‌ఐలు, 257 మంది ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డులు.. మొత్తం 298 మందితో బందోబస్తులో ఉండనున్నారు. కేంద్రాల వద్ద ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లు, ఇంటర్‌నెట్ షాపులను మూసివేయాలని, చుట్టుపక్కల లౌడ్‌స్పీకర్లు పెట్టొద్దని, 500 మీటర్ల వరకు ప్రజలు ఎవరూ గుమిగూడవద్దని ఆదేశించారు. పరీక్షా సమయానికే 2 గంటల ముందే కేంద్రానికి చేరుకోవాలని, మానసికంగా ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. కేంద్రాలకు సమీపంలో పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. మూడు రూట్ మొబైల్, మూడు ఎస్కార్ట్ పార్టీలను ఏర్పాటు చేశారు. ప్రజ్ఞాపూర్, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల ప్రాంతాల్లో ప్రత్యేకమైన బస్సులను ఏర్పాటు చేశారు.

సజావుగా నిర్వహించాలి : కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 7 : గ్రూప్-1 పరీక్ష నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా సజావుగా నిర్వహించాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్, గ్రూప్-1 పరీక్ష జిల్లా నోడల్ అధికారి గరీమా అగ్రవాల్‌తో కలిసి ఏర్పాట్లపై సమీక్షించారు. అలాగే, రూట్, డిపార్ట్‌మెంట్, ఐడెంటిఫికేషన్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్ అధికారులు అన్ని పరీక్ష కేంద్రాలను సందర్శించి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు, రక్షణ ఏర్పాట్లు, విద్యుత్తు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, తాగునీరు తదితర ఏర్పాట్లను పరిశీలించి, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌లకు తగు సూచనలివ్వాలని ఆదేశించారు.

గజ్వేల్‌లో మళ్లీ డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులు కన్నెర్ర చేశారు. ఏడాది కాలంగా గుర్రుగా ఉన్న వారు ఎన్నిసార్లు ఆందోళనలు చేపట్టిన సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఆరు నెలల్లోనే ఆరోసార్లు లబ్ధిదారులు నిరసన చేపట్టారు. తాజాగా శుక్రవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు.

- గజ్వేల్, జూన్ 7



లబ్ధిదారులను సముదాయిస్తున్న ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి

ఆరు నెలల్లో ఆరోసారి

గజ్వేల్‌లో మళ్లీ డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల కన్నెర్ర

- మున్సిపల్ కార్యాలయం ఎదుట రెండు గంటలు ఆందోళన
- పట్టాలు ఇప్పించాలి.. ఇళ్లను అప్పగించాలని డిమాండ్
- అధికారులతో మాట్లాడతానన్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి
- పోలీసులు రంగ ప్రవేశం.. సముదాయించిన పంపించిన సీఐ
- ఏడాదిగా అధికారులకు, పోలీసులకు తలనొప్పిగా సమస్య

మున్సిపాలిటీ ఎదుట ఆందోళన చేస్తున్న డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులు



గతంలో తమకు కేటాయించిన ఇళ్లకు సంబంధించిన పట్టాలు ఇప్పించాలని, ఇళ్లను అప్పగించాలని డిమాండ్ చేస్తూ డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు గజ్వేల్ మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. గతేడాది మార్చిలో లక్కీ డ్రా ద్వారా తమకు ఇళ్లను కేటాయించారని, ఇప్పటివరకు ఇళ్లకు సంబంధించి ఎలాంటి పట్టా సర్టిఫికెట్ ఇవ్వలేదని, ఇళ్లను అప్పగించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనూ ఆందోళన చేయగా, తాము అండగా ఉండి ఇళ్లను ఇప్పిస్తామని నేతలు ఇచ్చిన హామీలు నోటిమాటకు పరిమితమయ్యాయని ఆగ్రహం చేశారు. లబ్ధిదారులు అంతా పట్టణంలోని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి ఇంటి బాట పట్టారు. ఆయనను కలిసి ఇళ్లను ఇప్పించాలని కోరారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ మున్సిపల్ కార్యాలయం వద్దకు వచ్చి అధికారులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. కాగా ఇటీవల పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో అధికారులంతా సెలవుల్లో ఉన్నారని, వచ్చాక మాట్లాడి సమస్యను పరిష్కరింపజేస్తామని హామీ ఇచ్చారు. అయినప్పటికీ లబ్ధిదారులు ఆందోళన కొనసాగించడంతో చివరకు పోలీసులు రంగం ప్రవేశం చేశారు. గజ్వేల్ సీఐ సైదా కలుగజేసుకుని బుధవారం వరకు అధికారులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపేందుకు యత్నిస్తామని, ఆందోళన విరమించాలని సముదాయించారు. సీఐ హామీ మేరకు లబ్ధిదారులు ఆందోళనను విరమించి, అక్కడి నుంచి వెళ్లిపోయారు.

రగులుతున్న సమస్య

ఏడాది కాలంగా రగులుతున్న ఈ సమస్యకు సరైన పరిష్కారం చూపడంలో అటు ప్రభుత్వం, ఇటు అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండడంతో ఆందోళన చేసిన ప్రతిసారీ పోలీసులు ఇబ్బందులు పడుతున్నారు. మల్లన్నసాగర్ భూనిర్వాసితులు లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లలో ఉండడంతో వారి సమస్యలు పరిష్కరించలేక, లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించలేక అటు అధికారులు, ఇటు పోలీసులు తల పట్టుకుంటున్నారు. ఆరు నెలల్లో ఆరుసార్లు లబ్ధిదారులు ఆందోళనకు దిగగా, ప్రతిసారి పోలీసులే వారిని సముదాయించి పంపించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



చివరి దశ పనులు కొనసాగుతున్న హుస్నాబాద్‌లోని రైతు బజార్

'కోడ్' ముగిసింది.. ఆటంకం తొలిగింది!

హుస్నాబాద్‌లో భవనాల ప్రారంభానికి సిద్ధం

- పూర్తయిన మాతా శిశు ఆరోగ్య కేంద్రం
- రైతు బజార్ పనులకు తుది మెరుగులు
- చివరి దశకు మున్సిపల్ కార్యాలయ నిర్మాణం
- త్వరలో ప్రారంభించేందుకు చర్యలు

హుస్నాబాద్ టౌన్, జూన్ 7 : పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగియడంతో ఇక అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ఆటంకం తొలిగింది. హుస్నాబాద్ పట్టణంలో నిర్మించిన భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఏళ్ల తరబడి సాగుతున్న కోట్ల రూపాయల అభివృద్ధి పనుల నిర్మాణం పూర్తయింది. ఎన్నికల కోడ్ ముగియడంతో త్వరలోనే వీటిని ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న మున్సిపల్ కార్యాలయ భవనం, రైతు బజార్ భవనం, మాతా శిశు ఆరోగ్య కేంద్రం పూర్తి కావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదే కాకుండా పోలీస్ డివిజన్ కార్యాలయ పనులు సైతం త్వరితగతిన పూర్తవుతున్నాయి.

వడివడిగా మున్సిపల్ భవనం

హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయ నూతన భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయి. హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. 2022 ఫిబ్రవరిలో అప్పటి ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు దీనికి శంకుస్థాపన చేశారు. రూ. 2.50 కోట్లతో ఈ భవన నిర్మాణ పనులు చేస్తున్నారు. గ్రౌండ్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్‌లలో అధునాతనంగా నిర్మిస్తున్నారు. ఇంకా పెయింటింగ్, ఎలక్ట్రికల్, వెల్‌వేషన్ ఇతర పనులు చేయాల్సి ఉంది. అయితే కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో ఈ పనులు మందకొడిగా సాగుతున్నాయి.



మున్సిపల్ కార్యాలయ భవనం

రైతు బజార్‌లో మెరుగులు

హుస్నాబాద్ పట్టణంలోని చావడి వద్ద నిర్మిస్తున్న రైతు బజార్ పనులు తుది మెరుగులు దిద్దుకుంటున్నది. ఇంకా ఎలక్ట్రిసిటీ, ప్లంబింగ్ పనులు జరుగుతున్నాయి. దీనిని రూ. 2.53 కోట్లతో నిర్మిస్తున్నారు. పలు సమస్యలతో ఆరు సంవత్సరాలకుపైగా ఈ పనులకు మోక్షం కలగలేదు. దీనికి మార్కెట్ శాఖ నుంచి నిధులు కేటాయించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో రైతు బజార్‌కు, ఫస్ట్ ఫ్లోర్‌లో ఫంక్షన్ హాల్, సెకండ్ ఫ్లోర్‌లో కిచెన్, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్ నిర్మాణం చేస్తున్నారు.

సిద్ధంగా ఎంసీహెచ్

హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్మిస్తున్న 50 పడకల మాతా శిశు ఆరోగ్య కేంద్ర(ఎంసీహెచ్) భవనం ప్రారంభానికి సిద్ధమైంది. రూ.7.50 కోట్లతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు కాంట్రాక్టర్‌కు ఒక్క బిల్లు కూడ రాలేదని తెలిసింది. ప్రారంభానికి సిద్ధం చేసినా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ ఆవేదన చెందుతున్నారు.



మాతా శిశు ఆరోగ్య కేంద్రం

20లోగా పాఠశాలల్లో పనులు పూర్తిచేయాలి

- లేకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవు
- 176 బడుల్లోనే ఇప్పటి వరకు నిర్మాణాలు పూర్తి
- మిగతా చోట్ల ఎందుకు కాలేదు ?
- అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్ మను చౌదరి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 7 : అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన పనులను 20వ తేదీలోగా పూర్తిచేయాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు అమ్మ ఆదర్శ కార్యక్రమం కింద జిల్లాలో 814 పాఠశాలల్లో విద్యుత్, తరగతి గదులు, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు, ప్రహరీ, తదితర మరమ్మతు పనులను చేపట్టామని తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభం కావడానికి ఇంకా ఐదు రోజుల సమయం మాత్రమే ఉన్నా ఇప్పటికీ 176 పాఠశాలలలో నిర్మాణ పనులు పూర్తి కాగా, మిగతా పాఠశాలలలో ఎందుకు పూర్తి కాలేదని పంచాయతీరాజ్, ఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. నిర్మాణ ప్రగతి సరిగా లేని పాఠశాలలను, అసలే పనులు ప్రారంభించని బడులను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారితో కలిసి సందర్శించి త్వరగా నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డిని ఆదేశించారు. సోమవారం అన్ని మండలాల్లో ఎంపీడీవోలు, ఎంఈవోలు, పంచాయతీరాజ్ ఇంజనీర్లు, ఐకేపీ వీవోలు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. నిర్మాణం చివరి దశలో ఉన్న పాఠశాలలలో రంగులు పూర్తిచేసి 12లోగా అందించాలని, మిగతా పాఠశాలల్లో 20వ తేదీలోగా 100 శాతం పనులు పూర్తి చేయాలన్నారు. లేదంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈలు, డీఈలు తదితరులు పాల్గొన్నారు.

10న ఉపాధిహామీ రక్షణ కోసం రాష్ట్ర సదస్సు

సంగారెడ్డి రూరల్, జూన్ 7: ఉపాధిహామీ రక్షణ కోసం ఈనెల 10న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు పిలుపునిచ్చారు. సంగారెడ్డి మండలం కల్పగూర్, అంగడిపేట గ్రామాల్లో రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక సంఘాల పోరాట ఫలితంగా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద వందరోజుల పని గ్యారంటీ చేస్తూ కేంద్రం చట్టం చేసిందన్నారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యుడు శివదాసన్, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్, ఇతర ప్రముఖులు హాజరవున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, మానయ్య, జగదాంబ, చంద్రయ్య, శివయ్య, అంజయ్య, లక్ష్మి, అనిత తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లకు వెపన్ ట్రైనింగ్



గజ్వేల్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లకు వెపన్ వినియోగంపై శిక్షణను ఇస్తున్న శిక్షకులు

గజ్వేల్, జూన్ 7: గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో ఏడో రోజు ఎన్‌సీసీ క్యాడెట్లకు ఆయుధాల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. సంగారెడ్డి బెటాలియన్ ఆధ్వర్యంలో ఉదయం నుంచే యోగా, కవాతు, ఫైరింగ్, సిములేటర్ ఫైరింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, బ్యాటిల్ క్రాఫ్ట్, వెపన్ ట్రైనింగ్ తరగతులను నిర్వహించినట్లు క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ మధుసూదన్‌రావు తెలిపారు. నిజామాబాద్ గ్రూప్ తలసేనా శిబిరంలో రాష్ట్రం నుంచి పాల్గొనే 75 మంది క్యాడెట్లకు ఆబ్స్టికిల్ ట్రైనింగ్, మ్యాప్ రీడింగ్, హెల్త్ అండ్ హైజీన్, జడ్జింగ్ డిస్టెన్స్, ఫైరింగ్, టెంట్‌పిచ్చింగ్‌లలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు క్యాంపు డిప్యూటీ కమాండెంట్ కెప్టెన్ భవానీ తెలిపారు. ఆల్ఫాబ్రావో, ఛార్లీ, డెల్టా కేటగిరీలుగా విభజించి క్యాడెట్లకు ఖోఖో, వాలీబాల్, సాంస్కృతిక పోటీలను నిర్వహించినట్లు ఎన్‌సీసీ అధికారి విజయభాస్కర్, శంకరయ్య తెలిపారు.

బదిలీలు, పదోన్నతులకు రంగం సిద్ధం

- డీహెచ్, డీఎంఈ, టీవీవీపీ అధికారులు, ఉద్యోగులకు స్థానచలనం
- సాధారణ బదిలీలు, పదోన్నతులపై త్వరలో వెలువడనున్న జీవో
- ఇప్పటికే ఆయా విభాగాల హెచ్‌వోడీలు వివరాలు సేకరణ



సంగారెడ్డిలోని డీఎంహెచ్‌వో కార్యాలయం



డీసీహెచ్ఎస్ కార్యాలయం

సంగారెడ్డి అర్బన్, జూన్ 7: వైద్య ఆరోగ్యశాఖలో బదిలీలు, పదోన్నతులకు రంగం సిద్ధమైందా అంటే.. అవుననే సమాధానం ఆ వర్గాల్లో వినిపిస్తున్నది. ఎన్నికల కోడ్ ముగియగానే సాధారణ బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన జీవో త్వరలో వెలువడనున్నదని తెలుస్తోంది. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(డీహెచ్), డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ), తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ)విభాగాల్లో పనిచేసే జిల్లా వైద్యాధికారులు, వైద్యాధికారులు, ఉద్యోగులు, వైద్య సిబ్బందికి స్థాన చలనం కలగనున్నది. ఇప్పటికే ఆయా విభాగాల హెచ్‌వోడీలు అధికారులు, ఉద్యోగుల వివరాలు సేకరించారు. బదిలీలు, పదోన్నతుల భాగంగా సంగారెడ్డి జిల్లాకు కొత్త వైద్యాధికారులు వచ్చే అవకాశం ఉంది. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(డీహెచ్) పరిధిలోని వస్తే మూడేళ్లుగా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా డా.గాయత్రీదేవీ కొనసాగుతున్నారు. 3.4.2021న రెగ్యులర్ డీఎంహెచ్‌వోగా డా.లక్ష్మణ్‌సింగ్‌ను ప్రభుత్వం నియమించినా ఆయనకు చార్జీ ఇచ్చేందుకు జిల్లా యంత్రాంగం నిరాకరించింది. దీంతో డా.గాయత్రీదేవే అప్పటి నుంచి ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా కొనసాగుతున్నారు. గతంలో బీఆర్ఎస్‌కు అనుకూలంగా వ్యవహరించడం, ఇతరత్రా ఆరోపణల నేపథ్యంలో గత మార్చిలోనే ఉమ్మడి జిల్లాలోని సిద్దిపేట, మెదక్ జిల్లాల డీఎంహెచ్‌వోలను ఒకరోజు వ్యవధిలోనే ప్రభుత్వం బదిలీచేసింది. ఆ క్రమంలో సంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వోను కూడా మార్చుచేసి సీనియర్‌ను డీఎంహెచ్‌వో నియమిస్తారన్న ప్రచారం కూడా జోరుగా జరిగింది. ఇక డీఎంఈ పరిధిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌తో పాటు అనుబంధ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్లు కొత్తవారు వచ్చే అవకాశం ఉంది. అదనపు డీఎంఈ హోదా ఉన్నవారే ఆ పోస్టుకు అర్హులు, కాగా ప్రస్తుతం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.సుధామాధురి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్ ఇద్దరూ ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. వారి స్థానంలో కొత్తవారు రానున్నారని తెలుస్తోంది. వైద్య విధాన పరిషత్ పరిధిలో కొన్నేళ్లుగా డీసీహెచ్ఎస్‌గా పనిచేస్తున్న డా.సంగారెడ్డికి కూడా స్థాన చలనం తప్పనిసరి అని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతం

సంగారెడ్డి అర్బన్, జూన్ 7: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం గణిత శాస్త్రం పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరిగింది. సంగారెడ్డిలోని కరుణ హైస్కూల్, రామచంద్రాపురంలోని జడ్పీ హైస్కూల్, జహీరాబాద్‌లోని సిద్ధార్థ హైస్కూల్ కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. 150 మందికి 108 మంది హాజరుకాగా, 42 మంది గైర్హాజరయ్యారు. 72 శాతం హాజరు నమోదైందని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహనా సదస్సు

అక్కన్నపేట, జూన్ 7: రైతులు భవిష్యత్‌తరాలకు ఉపయోగపడే ఆయిల్ పామ్ తోటలపై అవగాహన పెంపొందించుకోవాలని అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలో ఉల్లి బాలయ్య తోటలో మానిటరింగ్ ఆఫీసర్ విజయ్ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్‌పామ్ తోటల పెంపకంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం సబ్సిడీపై తోటలం పెంపకం కోసం రాయితీ ఇస్తున్నదని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

'మహిళలకు ఇవ్వడం గొప్ప విషయం'

ములుగు, జూన్ 7: మహిళా సాధికారత లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం మహిళలకు పాఠశాలల యూనిఫామ్స్ కుట్టే అవకాశం కల్పించడం గొప్ప విషయమని డీపీఎం వాసుదేవ్, ఐకేపీ సభ్యులు పేర్కొన్నారు. ములుగులోని ఐకేపీ కేంద్రంలో విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేసి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి మహిళా సంఘాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల దుస్తులను కుట్టే పనులు అప్పగించారన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ములుగు మండల మహిళా సమైక్య ద్వారా స్కూల్ యూనిఫామ్స్ సిద్ధం చేయిస్తున్నట్లు వెల్లడించారు.

పర్యావరణాన్ని రక్షించుకోవడం మన అందరి బాధ్యత

- హుస్నాబాద్ మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ శివరంజని



మొక్కలు నాటుతున్న మెజిస్ట్రేట్ శివరంజని

హుస్నాబాద్, జూన్ 7: పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మన అందరి బాధ్యత అని హుస్నాబాద్ మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ శివరంజని అన్నారు. శుక్రవారం ఆమె హుస్నాబాద్ పట్టణంలోని మున్సిఫ్ కోర్టులో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. మొక్కలు నాటడమే కాదు వాటికి నీరు పోసి రక్షించాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్‌ను వినియోగించవద్దన్నారు. పరిశుభ్రత మన ఇంటి వరకే పరిమితం కావద్దని చుట్టు పక్కలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, ఎజీపీ కన్నోజు రామక్రిష్ణ, చిత్తారి హన్మయ్య, సదానందం, సంపత్, దీకొండ ప్రవీణ్ పాల్గొన్నారు.

న్యాయశాస్త్ర పరిపాలనలో శిక్షణకు దరఖాస్తులు

● జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి అఖిలేష్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, జూన్ 7: జిల్లాలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్, గవర్నమెంట్ ప్లీడర్ల వద్ద జూనియర్‌గా చేర్పించి మూడేళ్ల న్యాయశాస్త్ర పరిపాలనలో స్టైయిఫండ్‌తో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి టి.అఖిలేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికిగాను ఉమ్మడి మెదక్ జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన అభ్యర్థుల కోసం ఎనిమిది సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. న్యాయశాస్త్రంలో పట్టా పొంది, సంవత్సర ఆదాయం రూ.2 లక్షలకు మించకుండా, కుల, ఆదాయ, నివాసపత్రాలతో, పాటు డిగ్రీ, న్యాయశాస్త్ర విద్య పట్టాలతో, బార్ అసోసియేషన్ రిజిస్ట్రేషన్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్‌లతో జూలై 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆరోగ్య ప్రదాయిని.. అల్లనేరేడు


అమ్మకానికి సిద్దంగా ఉన్న అల్లనేరేడు పండ్లు

● పండ్లతో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు
● కిలో రూ.70 నుంచి రూ.100ల వరకు విక్రయం
● అత్యధికంగా నారాయణఖేడ్‌లో రూ.200లకు విక్రయం


ఖేడ్‌లో విక్రయానికి సిద్ధంగా అల్లనేరేడు పండ్లు

సిద్దిపేట అర్బన్/నారాయణఖేడ్, జూన్ 7: అల్లనేరేడు పండ్ల సీజన్ వచ్చేసింది. ఎన్నో ఔషధ గుణాలున్న ఈ పండ్లు చూడగానే నోరూరించేలా ఉంటాయి. ప్రస్తుతం అల్ల నేరేడు ధర మార్కెట్‌లో కిలోకు రూ.70 నుంచి రూ.100 వరకు పలుకుతున్నది. ప్రొటీన్, కాల్షియం, కార్బొహైడ్రేట్లు, ఐరన్, మెగ్నీషియం, ఫాస్పరస్, పొటాషియం, సోడియం, విటమిన్ సీ, థయామిన్, రైబోఫ్లావిన్, నియాసిన్, విటమిన్ బీ, విటమిన్ ఏ, ఆరోగ్యకరమైన కొవ్వుల సమ్మేళనం అయిన అల్లనేరేడు పండ్లు అనేక వ్యాధులను నియంత్రించే శక్తి కలిగి ఉంటాయి. అల్లనేరేడు పండ్లు రోగ నిరోధక శక్తిని పెంచుతాయని వైద్యులు తరచూ చెబుతుంటారు.



పండ్ల వల్ల లాభాలు

అల్లనేరేడు పండ్లు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని శాస్త్రీయంగా రుజువైంది. వీటిలో పొటాషియం అధికస్థాయిలో ఉంటుంది. మీ గుండె ఆరోగ్యంగా ఉండాలంటే తరచూ ఈ పండ్లను తీసుకుంటే చాలా మేలు చేస్తుంది. అంతేకాకుండా స్ట్రోక్, హై బ్లడ్ ప్రెషర్ రాకుండా నిరోధిస్తుంది. శ్వాసనాళాలు, ఊపిరితిత్తులను శుభ్రపరుస్తుంది. విష వాయువులు, వాయు కాలుష్యం కారణంగా దెబ్బతిన్న ఊపిరితిత్తులు, శ్వాసనాళాలను శుభ్రం చేసే శక్తి అల్లనేరేడు పండ్లకు ఉంది. వాయు కాలుష్యం కారణంగా ఎదురయ్యే ఫ్రీరాడికల్స్‌ను ఇవి నియంత్రిస్తాయి. వీటిలో ఉండే జింక్, విటమిన్ సీ ఆస్తమా లక్షణాలను తగ్గిస్తాయి. కొలన్ కేన్సర్‌ను నిరోధిస్తుంది. అల్లనేరేడులో ఉండే సైనైడిన్ వంటి సమ్మేళనాలు కొలన్ కేన్సర్‌ను నిరోధించే శక్తిని కలిగి ఉంటాయి. అల్లనేరేడు పండ్లలో ఉండే యాంటాక్సైడ్లు ఫ్రీరాడికల్స్‌పై పోరాడుతాయి. కేన్సర్ కణాలు వృద్ధిని అడ్డుకుంటాయి. డయాబెటిస్‌కు చికిత్సగా అల్లనేరేడు పండ్లలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ. రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉండడానికి దోహదం చేస్తాయి. అధిక మూత్ర విసర్జన, దప్పిక వంటి డయాబెటిస్ లక్షణాలను అల్లనేరేడు పండ్లు తగ్గిస్తాయి. కొలాజెన్ పెంచుతాయి. అల్లనేరేడు పండ్లు తింటే చర్మం మిలమిల మెరుస్తుంది. వీటిలోని యాంటాక్సిడెంట్ల సమ్మేళనాలు, విటమిన్ సీ చర్మంలో కొలాజెన్ ఉత్పత్తికి దోహదం చేస్తాయి. అందుకే చర్మం యవ్వనాన్ని సంతరించుకుంటుంది. అంతేకాకుండా అల్లనేరేడు పండ్లలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. కొన్నిరకాల ఇన్ఫెక్షన్లను ఇవి అడ్డుకుంటాయి. దంతాలు, చిగుళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. అల్లనేరేడు పండ్లే కాకుండా.. ఆకులు, ఇత్తులు కూడా ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఈ పండ్లు తినడం వల్ల కడుపునొప్పితో బాధపడుతున్న వారికి ఉపశమనం లభిస్తుంది. పేగుల్లో పేరుకుపోయిన వెంట్రుకలను తొలగించే శక్తి ఉంటుంది. మూత్రంలో మంట తగ్గడానికి ఈ పండ్లు ఉపకరిస్తాయి. ఈ పండ్లను రోజుకొకటి తింటే వైద్యుల దగ్గరికి వెళ్లాల్సిన అవసరం ఉండదని పలువురు అంటున్నారు. అలాగే నారాయణఖేడ్ మార్కెట్‌లో అల్లనేరేడు పండ్లు దర్శనమిస్తున్నాయి. సీజనల్ పండ్లు కావడంతో పాటు రుచికరంగా ఉంటాయి. ప్రస్తుతం వీటి ధర నారాయణఖేడ్ మార్కెట్‌లో కిలోకు రూ.160 నుంచి రూ.200ల వరకు విక్రయిస్తున్నారు.

కాంగ్రెస్ గెలుపుతో మార్పునకు నాంది

● కలిసికట్టుగా పనిచేసి అభివృద్ధికి కృషిచేస్తాం
● జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్


ఖేడ్‌లో విజయోత్సవ ర్యాలీలో గుర్రపు కళాకారుల నృత్యాలు

నారాయణఖేడ్, జూన్ 7: కాంగ్రెస్ గెలుపు మార్పునకు నాంది పలికిందని, కలిసికట్టుగా పనిచేసి అభివృద్ధికి కృషి చేస్తామని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ అన్నారు. శుక్రవారం నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట నుంచి కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యుడు నగేష్‌షెట్కార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు కర్నె.శ్రీనివాస్, శంకరయ్యస్వామి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్‌షెట్కార్, సురేష్‌షెట్కార్ కూతుళ్లు గిరిజాషెట్కార్, శివానీషెట్కార్, సాగర్ షెట్కార్, జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు రషీద్ ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకుసాగారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు భారీఎత్తున బాణసంచా కాల్చారు. ర్యాలీలో అడుగడుగునా కాంగ్రెస్ అభిమానులు సురేష్‌షెట్కార్‌ను, సంజీవరెడ్డిలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. రాజీవ్ చౌక్ వద్ద క్రేన్ సహాయంతో గజమాల వేశారు. అనంతరం రాజీవ్ చౌక్ వద్ద సురేష్‌కుమార్ షెట్కార్ మాట్లాడుతూ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు బీఆర్ఎస్ గాలిలో గెలిచిన బీబీపాటిల్, అభివృద్ధి ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. బీఆర్ఎస్ ఓడిపోతుందని తెలిసి బీజేపీలో చేరి పోటీ చేశారన్నారు. బీజేపీ నాయకులు దేవుడిని రాజకీయాల్లోకి తెచ్చి మతం పేరిట కుట్రలు పన్ని యువతను చెడగొడుతున్నారని పేర్కొన్నారు. తాను చేసిన త్యాగాన్ని ఢిల్లీ నుంచి ఇక్కడి సాధారణ కార్యకర్త వరకు గుర్తించి సెక్యులర్ పార్టీ అయిన కాంగ్రెస్‌ను గెలిపించి బీజేపీకి బుద్ధి చెప్పారన్నారు. దశాబ్దకాలంగా కాంగ్రెస్ కార్యకర్తలు ఇబ్బందులకు గురయ్యారని, తాను కాంగ్రెస్ భవిష్యత్తు, కార్యకర్తలు బాగుండాలనే లక్ష్యంగా ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. తాను ఎంపీగా, సంజీవరెడ్డి ఎమ్మెల్యేగా అభివృద్ధి కోసం శ్రమిస్తామన్నారు. పరిశ్రమలను, విద్యాసంస్థలను ఏర్పాటు చేసి గ్రామాలు, తండాలకు అన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ కార్యకర్తలకు వనవాసం తప్పలేదన్నారు. తనను ఎమ్మెల్యేగా, సురేష్ షెట్కార్‌ను ఎంపీగా గెలిపించి సీఎం రేవంత్‌రెడ్డికి డబుల్ ధమాక ఇచ్చిన ఘనత నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రజలదే అని చెప్పారు. ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా, ఎంపీగా గెలిపించి 2009 ఫలితాలను పునరావృతం చేశారన్నారు. ఏ ఎన్నికలు వచ్చినా కలిసికట్టుగా పనిచేస్తామని, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతామని వెల్లడించారు. అంతకుముందు సురేష్‌షెట్కార్, సంజీవరెడ్డిలు మంగల్‌పేట దుర్గామాత ఆలయానికి చేరుకోగానే కార్యకర్తలు ఘన స్వాగతం తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీలో బోరంచకు చెందిన గుర్రపు కళాకారుల నృత్యం ఆకట్టుకుంది.


ఖేడ్‌లో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

10లోగా జొన్నల కొనుగోళ్లు పూర్తిచేయాలి

● వ్యవసాయశాఖ జిల్లా అధికారి గోవింద్ ● అల్లాదుర్గంలో జొన్నల కొనుగోలు కేంద్రం సందర్శన

అల్లాదుర్గం, జూన్ 7: జొన్నల కొనుగోలును వేగవంతం చేసి ఈనెల 10లోగా పూర్తి చేయాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి గోవింద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అల్లాదుర్గంలోని రైతువేదికలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో తూకం వేయని జొన్నల నిల్వలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. 148 మంది రైతులకు సంబంధించిన జొన్నల బస్తాలు తూకం వేయాల్సి ఉండగా, వీటిలో 50 మంది రైతులకు సంబంధించిన జొన్నల బాస్తాలను తూకం వేశామని పీఏసీఎస్ కార్యదర్శి శివ్వాగౌడ్ డీఏవోకు వివరించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా జొన్నల కొనుగోలును త్వరతగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఆయన వెంట ఏడీఏ రాంప్రసాద్, స్థానిక ఏవో రాజేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.


అల్లాదుర్గంలోని రైతువేదికలో ఏర్పాటుచేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి వివరాలను అడిగి తెలుసుకుంటున్న డీఏవో గోవింద్

చెట్టును ఢీకొన్న బైక్, వ్యక్తి మృతి


మల్లేశం(ఫైల్)

కౌడిపల్లి, జూన్ 7: బైక్ అదుపు తప్పి చెట్టును బలంగా ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని బట్టెమ్మ ఆలయం సమీపంలో శుక్రవారం జరిగింది. మృతుడి కుటుంబీకుల తెలిపిన వివరాల ప్రకారం.. కొల్చారం మండల కేంద్రానికి చెందిన మంగళి మల్లేశం(34) తన ద్విచక్ర వాహనంపై సొంత పనుల నిమిత్తం కౌడిపల్లి మండల కేంద్రానికి వెళ్లాడు. పనులు ముగించుకున్న అనంతరం స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. కౌడిపల్లి శివారులోని బట్టెమ్మ ఆలయం సమీపంలోకి రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టును బలంగా ఢీకొట్టింది. దీంతో మల్లేశం తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వెంటనే 108 అంబులెన్స్‌లో మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడు కొంతకాలంగా ఓ దినపత్రికలో జర్నలిస్టుగా విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

● రెండు నెలల కిందట చనిపోయినట్లు గుర్తింపు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రంజిత్

రామాయంపేట, జూన్ 7: పట్టణంలోని బీసీ కాలనీ గుట్ట సమీపంలో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. సుమారు 40 ఏళ్ల పైబడి ఉన్న మృతదేహం, కుళ్లిపోయి అస్థిపంజరంగా లభ్యమైంది. శుక్రవారం తెల్లవారుజామున అటుగా వెళ్లిన పలువురు గమనించి పోలీసులకు సమాచారమందించారు. ఎస్ఐ రంజిత్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సదరు వ్యక్తి రెండునెలల క్రితం చనిపోయి ఉంటాడని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం అస్థిపంజరాన్ని అక్కడే గొయ్యి తవ్వి పాతిపెట్టారు.

చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి గల్లంతు

తూప్రాన్, జూన్ 7: చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి చెరువులో మునిగి గల్లంతయ్యాడు. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలోని కొత్త చెరువులో శుక్రవారం చోటు చేసుకున్నది. సంగారెడ్డికి చెందిన నర్సింహులు(50) కత్తులకు పదును పెడుతూ జీవనం సాగిస్తుంటాడు. కొంతకాలంగా తూప్రాన్ నివాసముంటున్నాడు. తూప్రాన్‌కు చెందిన మరో ఇద్దరు టేకు పోచయ్య, జెడిగాడి దేవందర్‌లతో కలిసి నర్సింహులు చేపలు పట్టేందుకు కొత్తచెరువుకు వద్దకు వెళ్లారు. చెరువులో గాలం వేయగా జారిపోవడంతో.. తీసేందుకు దిగిన నర్సింహులు మునిగిపోయాడు. ఈ విషయాన్ని మిగతా ఇద్దరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాలింపు చేపట్టారు.

అట్టహాసంగా ఆలయాల వార్షికోత్సవం


బోనాలు తీస్తున్న గిరిజన మహిళలు

నారాయణఖేడ్, జూన్ 7: మండల పరిధిలోని చల్లగిద్దతండాలో శుక్రవారం త్రయాహ్నిక జగదాంబ సేవాలాల్, రాంరావ్ మహరాజ్ ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి అభిషేకాలు, హోమం, అలంకరణ, మహాహారతి, గిరిజన సంప్రదాయంలో భోగ్ భండార్ కార్యక్రమాలను పురోహితుడు మోహన్‌జ్యోషి ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం పల్లకీసేవ, బోనాల ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చాందిబాయిరాంచందర్, తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్, తండా వాసులతో పాటు చుట్టుపక్కల తండావాసులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేటలో ఘనంగా కట్ట మైసమ్మ పండుగ


పెద్దశంకరంపేటలో కట్ట మైసమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

పెద్దశంకరంపేట, జూన్ 7: పెద్దశంకరంపేట పట్టణ సమీపంలో ఉన్న కట్టమైసమ్మ పండుగను శుక్రవారం వైభవంగా జరుపుకున్నారు. ఉదయం సరస్వతీ శిశుమందిర్ నుంచి అమ్మవారికి పూజా సామగ్రిని శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలతో తీసుకెళ్లారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఎంపీటీసీ వీణాసుభాష్‌గౌడ్, గ్రామ పెద్దలు కిష్టారెడ్డి, గంగారెడ్డి, సర్వేశ్వర్, మిథున, రమేష్, ఆయాఆ కులసంఘాల పెద్దలు, అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో రామ్మోహన్

మద్దూరు, జూన్ 7: మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులని శుక్రవారం ఎంపీడీవో ఎస్. రామ్మోహన్ ఎంపీవో ఖాజామొయినుద్దీన్‌తో కలిసి పరిశీలించారు. పలువురు రైతుల వ్యవసాయ భూముల్లో జరుగుతున్న పనులను ఈ సందర్భంగా వారు పరిశీలించి మాట్లాడారు. రైతులు ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. ఈ పనులు ముగిసిన వెంటనే చెరువు, కుంటల్లో మట్టితీసే పనులు కల్పించనున్నట్లు తెలిపారు. వారివెంట సెక్రటరీ వెంకటేశ్వర్లుతో పాటు ఫీల్డు అసిస్టెంట్ ఉన్నారు.

'సదస్సును జయప్రదం చేయాలి'

చేర్యాల, జూన్ 7: ఉపాధిహామీ చట్టం అమలులో ప్రభుత్వ అవకతవకలను నిరసనగా ఈనెల 10న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట్‌మావో కోరారు. ఈ మేరకు శుక్రవారం చేర్యాల మండలం చుంచనకోట గ్రామంలోని ఉపాధిహామీ పనుల జరుగుతున్న చోట సదస్సు కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రస్థాయి సదస్సుకు ఉపాధిహామీ కూలీలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలి

● ఎంపీపీ గంగాధరి సంధ్య

దౌల్తాబాద్, జూన్ 7: వానకాలం సమీపిస్తుడడంతో గ్రామాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అవగాహన కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం అందించే పథకాలను ప్రజలకు అందేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఎంపీపీ గంగాధరి సంధ్య కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ గంగాధరి సంధ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభలో ముందుగా ఆయా శాఖల అధికారులు నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ.. వానకాలం సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వ్యసాయశాఖ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. గ్రామాలల్లో నీటి ఎద్దడి సమస్య తల్తెకుండా ముందస్తుగా గ్రామాల ప్రత్యేక అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు బండారు దేవేందర్, మల్లేశం, తిరుపతి, మండల కో-ఆప్షన్ సభ్యులు హమ్మద్, అధికారులు పాల్గొన్నారు.

ములుగు: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ లావణ్య అంజన్నగౌడ్ పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లావణ్య మాట్లాడుతూ.. వర్షాకాలం సమీపిస్తున్న దృష్ట్యా గ్రామాల్లో పారిశుధ్య పనులపై అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. ఇప్పటికే గ్రామాల్లో నీటి కొరత ఉన్నట్లు తెలుస్తున్నదని, ప్రజలకు తాగునీరు అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు మురికి కాలువలు శుభ్రం చేయించడంతో పాటు వాటర్‌ట్యాంక్‌లను శుభ్రపరిచే పనులు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ బట్టు అంజిరెడ్డి, జిల్లా సలీం, ఎంపీడీవో శర్మ, ఎంపీటీసీలు లింగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, హరిబాబు, పోచమ్మ, మమత ప్రవీన్, వివిధ శాఖలకు చెందిన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ములుగు: మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లావణ్య



చేర్యాల: సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న కొమురవెల్లి ఎంపీపీ కీర్తన

● **చేర్యాల:** బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెడ్లలా చేపట్టిందని, ప్రజాసంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగించాలని కొమురవెల్లి ఎంపీపీ తలారి కీర్తన కోరారు. కొమురవెల్లి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ శాఖల సమీక్ష చేపట్టగా పలువురు సభ్యులు ఆయా సమస్యలను సభలో ప్రస్తావించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కుళ్లిపోయిన కోడిగుడ్లు పంపిణీ చేస్తున్నారని కొమురవెల్లి ఎంపీటీసీ కొయ్యడ రాజమణి ప్రస్తావించగా, మరోసారి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని సూపర్‌వైజర్ పావని పేర్కొన్నారు. గ్రామాల్లో నిరంతర విద్యుత్ ఉంటడం లేదని, రైతులు పొలాల వద్ద పనుల నిమిత్తం ఎల్‌సీ ఇవ్వమని కోరితే విద్యుత్ సిబ్బంది ఇవ్వకపోవడం తగదని పలువురు సభ్యులు పేర్కొనగా, ప్రభుత్వ ఆదేశానుసారం ఎల్‌సీ ఇవ్వడంలేదని, సాయంత్రం 5గంటల తరువాత ఇస్తున్నామని ఏఈ మధు తెలిపారు. ఎంపీపీ కీర్తన మాట్లాడుతూ.. ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి, ఎంపీడీవో కుమారస్వామి పాల్గొన్నారు.

● **జగదేవ్‌పూర్:** వానాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చొరవ తీసుకోవాలని, అలాగే తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ జాగ్రత్తలు పాటించాలని ఎంపీపీ బాలేశంగౌడ్ తెలిపారు. జగదేవ్‌పూర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ బాలేశంగౌడ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమవేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఆర్‌వో క్రిష్ణమోహన్, ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో శ్రీనివాస్‌వర్మ, ఎంపీటీసీలు కవితారమ్య మంజుల, స్రవంతి, మహేందర్‌రెడ్డి, కిరణ్‌గౌడ్, మహేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంటి నుంచి వెళ్లి.. గుంతలో శవమై తేలి



ఆంజనేయులు(ఫైల్)

మర్కుక్, జూన్ 7: ఇంటి నుంచి బయటికి వెళ్లిన యువకుడు ఓ గుంతలో శవమై తేలాడు. ఈ సంఘటన మర్కుక్ మండలం పాములపర్తిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన మునిగడప ఆంజనేయులు(21) అనే యువకుడు గురువారం సాయంత్రం బయటకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఆంజనేయులు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు శుక్రవారం ఉదయం మర్కుక్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని చెరువులు, కుంటల్లో గాలించారు. శుక్రవారం సాయంత్రం గ్రామంలోని ఓ గుంతలో అతడి మృతదేహం కనిపించడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

దుబ్బాక, జూన్ 7: చికిత్స పొందుతూ వృద్ధుడు మృతిచెందిన సంఘటన దుబ్బాక మున్సిపాలిటీలోని లచ్చపేట వార్డులో శుక్రవారం చోటుచేసుకున్నది. దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. లచ్చపేట వార్డుకు చెందిన చెట్ల నర్సయ్య (75)అనే వృద్ధుడు దుబ్బాక పెద్దచెరువు తూం వద్దకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు తూమ్‌లో పడిపోయాడు. స్థానికులు వెంటనే అతడిని దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పోలీసులమని మభ్యపెట్టి బంగారు గొలుసు కాజేసిన గుర్తుతెలియని వ్యక్తులు

గజ్వేల్, జూన్ 7: పోలీసులమని మభ్యపెట్టి గుర్తుతెలియని వ్యక్తులు వృద్ధురాలి వద్ద బంగారు గొలుసును కాజేసిన సంఘటన గజ్వేల్ పట్టణంలో శుక్రవారం చోటుచేసుకున్నది. పట్టణానికి చెందిన తోకల పద్మ అనే వృద్ధురాలు మహతి ఆడిటోరియం వద్ద నుంచి ఇంటికి వెళ్తున్నది. అదే సమయంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి తాము పోలీసులమని చెప్పారు. ఆమెను మాటల్లో పెట్టి బంగారం మెడలో వేసుకోవద్దని, ఇలా వేసుకోవడం వల్ల దొంగతనాలు జరుగుతున్నాయని, తీసి ఇస్తే తాము పేపర్లో చుట్టి ఇస్తామని, జాగ్రత్తగా చేతిలో పట్టుకుని ఇంటికి వెళ్లొచ్చని ఆమెను నమ్మించారు. అమాయకత్వంతో వృద్ధురాలు గొలుసును తీసి ఇవ్వడంతో ఓ పేపర్లో చుట్టారు. మట్టి చుట్టిన మరో పేపర్‌ను ఆమెకు ఇచ్చి, బంగారం ఉన్న పేపర్‌ను వారు తీసుకున్నారు. తీరా ఇంటికి వెళ్లి చూసుకున్న వృద్ధురాలు పేపర్లో మట్టి ఉండడంతో లబోదిబోమంటూ గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా తెలిపారు.

పాఠ్య పుస్తకాలను అందజేసిన అధికారులు



పాఠ్యపుస్తకాలను అందిస్తున్న అధికారులు

కుకునూరుపల్లి, జూన్ 7: మండలంలోని వివిధ జిల్లా పరిషత్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను అధికారులు శుక్రవారం అందజేశారు. కుకునూరుపల్లి నోడల్ ఆఫీసర్ సత్తయ్య మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. చిన్నకిష్టాపూర్, మంగోల్, లకుడారం, తిప్పారం పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నోడల్ ఆఫీసర్ బి. సత్తయ్య పాఠ్యపుస్తకాలను అందజేశారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్, ఇతర వసతులు కల్పిస్తున్నదని, విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలోనే చేరాలని కోరారు.

నిరాధార ఆరోపణలు సరికాదు

చేర్యాల, జూన్ 7 : మల్లన్న ఆలయ భూముల విషయంలో తమపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. చేర్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయ భూముల విషయమై అర్థరహిత విమర్శలు చేయడం మాని ఆధారాలు బయటపెట్టాలన్నారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి భూములు దానం చేసే గుణం ఉందే తప్ప, ఆగడాలు చేయబోరని, ప్రజావసరాలు, విద్యాసంస్థల ఏర్పాటుకు 12ఎకరాల భూమి విరాళంగా అందించిన విషయాన్ని గుర్తించాలన్నారు. తానుకూడా స్వతహాగా స్వగ్రామంలో భూమిని దానం చేశానని, సేవా కార్యక్రమాలకు లక్షలాది రూపాయలు ఖర్చుచేశానన్నారు. అసత్య ఆరోపణలు మానుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము రవి, పట్టణాధ్యక్షుడు మంచాల చిరంజీవులు, నాయకులు ముస్త్యాల కిష్టయ్య పుర్మ ఆగంరెడ్డి, ఆడెపు చంద్రయ్య, ముస్త్యాల యాదగిరి, దాసరి శ్రీకాంత్, బందెల మహిపాల్‌రెడ్డి, సనాది భాస్కర్, లింగంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దూళిమిట్టలలో ఉచిత వైద్య శిబిరం



గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న వైద్యులు

దూళిమిట్ట, జూన్ 7: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం మిట్టపల్లి సురభి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో గ్రామ ప్రజలు, పరిసర గ్రామాల ప్రజలు సుమారు 473 మంది పాల్గొన్నట్లు నిర్వహకులు తెలిపారు. వారికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆపరేషన్స్ అవసరమైన వారిని ఆస్పత్రికి రిఫర్ చేశామని, అక్కడ ఉచితంగా ఆపరేషన్స్ కూడా చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజ్‌మెంట్ సభ్యులు వెంకటేశ్వరరావు, వివిధ విభాగాల డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గ ప్రమాణస్వీకారాన్ని జయప్రదం చేయండి

గజ్వేల్, జూన్ 7: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారన్ని జయప్రదం చేయాలని ఐవీఎఫ్ యువజన అధ్యక్షుడు ఎన్‌సీ సంతోష్ పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలో ప్రమాణస్వీకార మహోత్సవానికి సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐవీఎఫ్ సిద్దిపేట జిల్లా విభాగం, మహిళా విభాగం, యువజన విభాగం, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం శనివారం గజ్వేల్ పట్టణంలోని ఓ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆయనవెంట నాయకులు నంగునూరి సత్యనారాయణ, తోట బిక్షపతి, నేతి శ్రీనివాస్, సీనియర్ నాయకుడు సంజయ్‌గుప్తా, కైలాస ప్రభాకర్, సత్యనారాయణ, నాగేందర్, ప్రవీణ్, బిక్షపతి, సంపత్‌కుమార్, బాలేష్ ఉన్నారు.

పట్టుతప్పితే ప్రాణాలు హరీ!



రోడ్డు ప్రక్కనే గ్రామీణ తాగునీటి పైపులైన్ కోసం ఏర్పాటు చేసిన చెక్‌వాల్ మ్యాన్‌హోల్స్‌పై కప్పు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. సిద్దిపేట -ముస్తాబాద్ రోడ్డులో సిద్దిపేట రూరల్ మండలంలోని పలు గ్రామాలకు మిషన్‌భగీరథ నీటిని సరఫరా చేసేందుకు పైపులైన్ ఏర్పాటు చేశారు. బండచేర్లపల్లి నుంచి రాఘవాపూర్ వరకు సుమారు ఐదు చెక్‌వాల్ మ్యాన్ హోల్స్ ఉన్నాయి. చెక్‌వాల్ మ్యాన్‌హోల్స్ రోడ్డుకు అనుకుని ఉండడంతో వాహనదారులు అదుపుతప్పి అందులో పడే ప్రమాదం ఉంది. గతంలో ద్విచక్రవాహనాలు అదుపుతప్పి పడిన సంఘటనలు లేకపోలేదు. వెంటనే మ్యాన్ హోల్స్‌కుపై కప్పులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

\- సిద్దిపేట రూరల్

10న సర్వసభ్య సమావేశం

మిరుదొడ్డి, జూన్ 7: ఈనెల 10న మిరుదొడ్డిలో మండల సర్వసభ్యసమావేశాన్ని నిర్వహించనున్నట్లు శుక్రవారం స్థానిక ఎంపీడీవో గణేష్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సర్వసభ్యసమావేశానికి మండల ప్రజా ప్రతినిధులు, మండల, గ్రామస్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుస్నాబాద్, జూన్ 7: హుస్నాబాద్ పట్టణంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు, రేపు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు హుస్నాబాద్ మున్సిపాలిటీ, హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు.

30 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, జూన్ 7: సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, సిబ్బందితో కొన్ని రోజుల క్రితం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 30 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని శుక్రవారం సిద్దిపేట కోర్టులో హాజరుపరచగా విచారణ చేసి 30 మందికి రూ.14,500 జరిమానా విధించారు.

ఆర్థిక సహాయం అందజేత

మర్కుక్, జూన్ 7: మండలంలోని పాములపర్తికి చెందిన పెద్దబోయిన రాములు వారం క్రితం మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న మర్కుక్ మండల బీసీఎస్ అధ్యక్షుడు, సిద్దిపేట జిల్లా ముదిరాజ్ సంఘం ఉప అధ్యక్షుడు మ్యాకల కనకయ్య మృతుడి కుటుంబసభ్యలకి రూ. 5000 ఆర్థిక సహాయం అందజేశారు.

పత్తి సాగుకు ముందుకు రావాలి

● వ్యవసాయ అధికారి నాగేందర్‌రెడ్డి



రైతులకు యంత్రంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మర్కుక్, జూన్ 7: అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయడం వల్ల అధిక దిగుబడి వస్తుందని మండల వ్యవసాయ అధికారి టి. నాగేందర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ పద్ధతిలోని వంగడాల పంట కాలం తక్కువగా ఉండడం వల్ల పూత, కాయలు, తొందరగా వస్తాయని అన్నారు. ఎకరాకు 25-30 కేజీల యూరియా 15 కిలోల పొటాష్ ఎరువులను వేసుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు యంత్రంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి విష్ణువర్దన్, రజనీకాంత్, రైతులు, రాశి ప్రతినిధి మనోజ్ పాల్గొన్నారు.

కళాశాలకు ప్రహరీ నిర్మించరూ?



దౌల్తాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

దౌల్తాబాద్, జూన్ 7: దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు, ఇబ్బందులు పడుతున్నారు. కళాశాల చుట్టూ పిచ్చిమొక్కలు, చెట్లు విపరీతంగా పెరగడంతో పాములు, విషకీటకాలు వచ్చే ప్రమాదం ఉందని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు కోరుతున్నారు.

ముగిసిన యోగా శిక్షణా శిబిరం



ప్రశంసాపత్రాలు అందుకున్న చిన్నారులతో ఎంఈవో

చేర్యాల, జూన్ 7: వేసవి సెలవుల దృష్ట్యా సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేర్యాలలో నిర్వహిస్తున్న యోగా ఉచిత శిక్షణా శిబిరం శనివారంతో ముగిసింది. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. చిన్నారులు అధికంగా హాజరై యోగా నేర్చుకున్నారు. ముగింపు కార్యక్రమానికి చేర్యాల మండల ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ.. యోగాను బాల్యం నుంచే అలవర్చుకుంటే సంపూర్ణ ఆరోగ్యం పొందుతారన్నారు. కార్యక్రమంలో యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి తోట సతీశ్, ఉచిత శిబిర సారథి కిషన్, ఎస్‌జీటీ టీచర్స్ సంఘం అధ్యక్షుడు శ్రీరాం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంఆర్‌సీకి చేరిన యూనిఫామ్స్, పుస్తకాలు

● 28 పాఠశాలల్లో 1873 మంది విద్యార్థులు

● జూన్ 12లోగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు

హుస్నాబాద్‌రూరల్, జూన్ 7: హుస్నాబాద్ మండల వనరుల కేంద్రానికి పాఠ్య, నోట్ పుస్తకాలతో పాటు ఒక జత స్కూల్ యూనిఫామ్స్ వచ్చాయి. అక్కడి నుంచి వాటిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలకు తీసుకు వెళ్తున్నారు. పాఠశాల పునఃప్రారంభం నాటికి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్య, నోట్ పుస్తకాలతో పాటు దుస్తులను అందుబాటులో ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగానే ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖతో పాటు మండల విద్యాశాఖ అధికారులు ఆ దిశగా పని చేస్తున్నారు.

28 పాఠశాలల్లో 1873 మంది విద్యార్థులు

మండలంలో 28 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 1873 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు పాఠ్య, నోట్ పుస్తకాలు అందుబాటులో ఉంచారు. ఒకే పుస్తకంలో తెలుగు-ఆంగ్లం భాషలో (బైలింగ్వల్ పుస్తకాలు ముద్రించారు. పార్ట్ 1, 2 చొప్పున ఏడాదికి రెండు సార్లు పంపిణీ చేయనున్నారు. రెండు మాధ్యమాల వారు చదువుకునే వీలు ఉంటుంది.



ఎంఆర్‌సీలో నిలువ చేసిన పాఠ్యపుస్తకాలు

ప్రస్తుతం ఒక జతనే యూనిఫాం

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల దుస్తులకు సరిపడే వస్త్రాన్ని సరఫరా చేసేది. ఈ ఏడాది 20 రోజుల ఆలస్యంగా వస్త్రం కుట్టేవారికి అందజేశారు. దీంతో వారు ఏమి చేయలేక ప్రస్తుతం ఒక్కో విద్యార్థికి ఒక్కో జత స్కూల్ యూనిఫాం మాత్రమే ఇవ్వనున్నారు. పాఠశాలలు ఈనెల 12 పునఃప్రారంభం కానుండడంతో ఒక్కో జతను మండల అధికారులకు అందజేసేందుకు సిద్ధమయ్యారు. పాఠ్య, నోట్ పుస్తకాలతో పాటు దుస్తులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేయనున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు.

తెలంగాణ ప్రజల గొంతుక బీఆర్ఎస్

● ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జూన్ 7: తెలంగాణ ప్రజల గొంతుకగా బీఆర్ఎస్ నిలుస్తుందని ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌కు ప్రతిపక్ష హోదాను ఇచ్చారని, ఆ హోదాతో ప్రజా సమస్యలపై పోరాడుతామన్నారు. సమస్యలు ఉన్న చోట బీఆర్ఎస్ ఉంటుందని, తాను ఉంటానని, గజ్వేల్ ప్రజలకు అండగా నిలుస్తానని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు అభివృద్ధికి ఓటు వేశారని, బీఆర్ఎస్‌కు ఓటు వేసిన ప్రజలకు మాజీ సీఎం కేసీఆర్ తరఫున, తన తరఫున కృతజ్ఞతలు తెలిపారు. రేవంత్‌రెడ్డి సిద్దిపేట ఓట్లపై మాట్లాడిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నానని, ఏ పార్టీ నాయకుడు కూడా ఇతర పార్టీలకు ఓటు వేయాలని చెప్పరన్నారు. రింగ్‌రోడ్డు పనులను పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం కృషిచేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జడ్పీటీసీ పంగ మల్లేశం, మునిసిపల్ వైస్ ఛైర్మన్ జకీయొద్దీన్, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు నవాజ్‌మీరా, నాయకులు విరాసత్‌అలీ, కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, గోపాల్‌రెడ్డి, అత్తెల్లి శ్రీనివాస్, బొగ్గుల చందు, నాయకులు దయాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బొల్లారం ఎల్లయ్య, భూపాల్‌రెడ్డి, నర్సింగరావు, అహ్మద్, పొన్నాల కుమార్, స్వామిచారీ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

జూలై 7న వరంగల్‌లో మాదిగల కవాతు

● లక్షలాదిమందితో నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ నాయకుల పిలుపు

సిద్దిపేట అగ్రికల్చర్ జూన్ 7: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జూలై 7న వరంగల్‌లో లక్షలాదిమందితో జరిగే మాదిగల కవాతును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నేతలు లింగంపల్లి శ్రీనివాస్, పరుశురాములు, మల్లిగారి యాదగిరిలు పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సభ అధ్యక్షత ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు పరశురాం, జిల్లా ఇన్‌చార్జి యాదగిరి, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రీనివాస్, ఎంఈఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరిలు హాజరైయ్యారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూలై 7న ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్‌లో జరిగే మాదిగల కవాతును విజయవంతం చేయాలని, ఇందుకు ప్రతి గ్రామంలో వందలాది మంది విద్యార్థులతో సన్నాహక కవాతులు, సదస్సులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలి

● ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట రూరల్, జూన్ 7: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి కోరారు. సిద్దిపేట రూరల్ మండలంలో శుక్రవారం పలు గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపారమైన అనుభవం ఉన్న ఉపాధ్యాయులచే విద్యా బోధన చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

● **హుస్నాబాద్‌రూరల్:** మండలంలోని పోతారం(ఎస్) ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్న పిల్లలను స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠాశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు శంకర్, అంగన్‌వాడీ టీచర్లు నజిత, స్వరూప తదితరులు ఉన్నారు.

● **దూళిమిట్ట:** మండలంలోని లింగాపూర్‌లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింహులుగౌడ్, పంచాయతీ కార్యదర్శి రాజుగౌడ్, అమ్మ ఆదర్శ కమిటీ పాఠశాల ఛైర్మన్ ఎర్ర లక్ష్మి, సీఏ వినోద, ఏఎన్ఎం రత్న, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, హేమలత, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



దూళిమిట్ట: లింగాపూర్‌లో బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

● **కుకునూరుపల్లి:** మండలంలోని మెదినిపూర్, కుకునూరుపల్లి, లకుడారంలో రెండో రోజు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు ఉన్నాయని, గ్రామస్థులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పాలని కోరారు.

● **మిరుదొడ్డి:** చిన్నపిల్లల్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని శుక్రవారం మిరుదొడ్డిలో అంగన్‌వాడీ కార్యకర్తలు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మూడు నుంచి ఐదు సంవ్సరాలలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు.



మిరుదొడ్డి: బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

● **నంగునూరు:** నంగునూరులోని ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొట్టిపర్తి రామస్వామిగౌడ్, తహసిల్ సుల్తానా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **చేర్యాల:** మండలంలోని పోతిరెడ్డిపల్లిలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, ఏపీఎస్ కమిటీ ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని తెలిపారు.